



# చిన్నారి వాళ్ళమ్మ

అన్నాలు తినేయడం అయిపోయాక మా ఇంట్లో పండగ ప్రోగ్రాం ఏవిటో నాకు బాగా తెలుసు. వుండ్రాళ్ళే కాకుండా పులిహోర, బొబ్బట్లు కూడా తినేటప్పటికి అందరికీ ఆయాసం వచ్చేసిందిగా. ఇంకో పది నిమిషాల్లో అమ్మా నాన్నా గుర్రే గుర్రు. ఇంక నే ఎక్కడ తిరిగినా ఎవ్వరికీ తెలియదు. ప్రమోదక్క చెప్పడవయితే ఈవేళ తప్పనిసరిగా తొమ్మిది మంది గణపతుల్నయినా చూడాలట. వాళ్ళు నిద్దరోతుండగా కనీసం నలుగుర్నయినా చూసొస్తే మిగతా వినాయకుళ్ళకి సాయంత్రం దణ్ణంపెట్టుకోవచ్చు. అన్నీ బానే వున్నాయి గానీ ఈ అమ్మ సంగతే నాకస్సలు అర్థమవట్లేదు. తినడానికి ఏదన్నా పెట్టేటప్పుడు అందరూ సమానమే అంటుంది. నాలుగు సమాన వాటాలు చేస్తుంది. పని చెప్పేటప్పుడు నాకూ చిన్నారికీ మాత్రమే చెప్తుంది. ఇంక తిట్టడానికొస్తే మాత్రం నేనొక్కదాన్నే కనిపిస్తానావిడ గారికి, నన్ను కొడితే మిగతా వాళ్ళకి బుద్ధొస్తుందిట. ఇలాంటిది నేనెక్కడా వినలేదు. నాకలాటప్పుడే

అడిగేయాలనిపిస్తుంది - ''నేనసలు నీ సొంత కూతుర్నా ! సవితి కూతుర్నా !'' అని. కానీ ఎందుకులే లేనిపోనివన్నీ అడిగి మళ్ళీ ఇంకో నాలుగు తినడం అని వూరుకుంటూ వుంటా. ఏవయినా అమ్మకి చిన్నారంటేనే అసలు ప్రేమ. బుజ్జన్నా కూడా ఎక్కువే. ఇందు సంగతి నాకు తెలియదుగానీ, నేనంటే మాత్రం అసలు మనసులో ఏవిటుందో చెప్పడం కష్టమే.

ఇప్పుడంటే చిన్నారి రెండో క్లాసులోకొచ్చేసి గొప్పదాన్నయి పోయాననుకుంటోంది గానీ నిరుడు క్రిస్మస్ సెలవల ముందు దాన్ని బళ్ళో చేర్పిచ్చింది నేనే కదా! ఆ వేళ చిన్నారికి అయిదో ఏడొచ్చిన పుట్టినరోజని చెప్పి దాని చేతిలో క్లాసు పిల్లలకి పెట్టేందుకో బిళ్ళల పొట్లం, నా చేతిలో ఫీజు కట్టేందుకు అయిదు రూపాయల కాయితవూ పెట్టి ప్రమోదక్క వాళ్ళతో నడిచెళ్ళమని పంపింది కదా అమ్మ ! అప్పుడెంత విసిగించేసిందో ఆ రాక్షసి నన్ను. రోడ్డు మీద ఎక్కడ సినిమా బొమ్మలు కనబడితే అక్కడాగిపోడవే. దీన్ని ఈడ్చుకుంటూ పాపక్కా ప్రమోదక్కా వాళ్ళనందుకోడానికి పరిగెత్తలేక చచ్చాను. తీరా స్కూలు గేటు దగ్గిర మదర్ సుపీరియర్ నిలబడి ఆలస్యంగా వచ్చిన అందరికీ ఒక్కొక్కటేస్తున్నారు. అక్కావాళ్లని చూసి సీనియర్ గర్ల్స్ కూడా లేటుగా వస్తారా అని కోప్పడ్డారు. ''మదర్! ఈవేళ ఈ పాప చిన్నారి పుట్టిన రోజు మన స్కూల్లో చేర్పిస్తున్నాం. రానని గోల చేస్తూంటే నడిపించుకు రావడం ఆలస్య మయింద''ని చెప్పి రక్షించింది ప్రమోదక్క. ఇంక పాపం మదరేం అనలేక గాడ్ బ్లెస్ యు మై ఛైల్డ్ అని దాని నెత్తిమీద రెండు చేతులూ పెట్టి బ్లెస్ చేసి లోపలికి పంపేశారు.

తీరా ఫీజు కడదావంటే ఆఫీసు సిస్టరు పేరు చెప్పమంటుంది. చిన్నారే దీని పేరంటే ఆవిడ చచ్చినా నమ్మలే. అమ్మనడిగి అసలు పేరు కనుక్కునొచ్చి మర్నాడు రసీదు తీసుకోమంది. నేనక్కడికో వుపాయంచేసి ''చిన్నారీ! నీ అసలు పేరు చెప్పమ్మా ! సిస్టరడుగుతున్నారు'' అంటే జవహర్‌లాల్ నెహ్రూ అని ఠకీమని చెప్పింది. ఆవిడ కోప్పడతారేమోనని భయంవేసి దీని అసలు పేరు పద్మండీ అని చెప్పి రాయించేశాను. ఆ తర్వాత ఎప్పుడు ఫీజు కట్టడానికెళ్ళినా నెహ్రూ గారక్కయ్యవి కదాని నవ్వుతారు. పోనీ చిన్నారంటే చిన్న పిల్ల కాబట్టి నేచేసిన సాయాలన్నీ గుర్తుండకపోవచ్చుగానీ అప్పుడోలా, ఇప్పుడోలా వుండడం ఎందుకూ అమ్మ పెద్దదయుండి కూడా ? అసలు నాకనిపిస్తుందీ నాన్నకే నేనంటే నిజమయిన ప్రేముందని - ఆఫీసునించి రాగానే నానీ అని ముందు నన్నే పిలుస్తారు. అది చూసి కూడా కుళ్ళే చిన్నారికి. 'సుశీలా అనయినా పెట్టారా ! నానీ అనయినా పెట్టారా నా పేరు ? వెధవ సిన్నారీ అని పెట్టారు' అని రోజూ దెబ్బలాడు తుంది నాన్నతో. నాకు సరయిన పేరు మీరు పెట్టలేదు కాబట్టే ఈ సుశీల చేత పేరు పెట్టించు కోవాల్సి వచ్చిందంటుంది. అసలేమో అమ్మమ్మ పేరు పెట్టాలని అమ్మా, బామ్మగారి పేరు పెట్టాలని నాన్నా అనుకోడంతో ఏం పెట్టాలో తేలక చిన్నారీ అని పిలవడం

మొదలెట్టారుట.

నాన్న, అమ్మ మంచి నిద్దట్లో పడ్డారు. పాపం అమ్మ చీకటితో లేచి ఒక్క రెక్క మీద అన్ని పన్లు చేసుకుందిట కదా. అయినా రెక్కలు పక్షులకుంటాయి గానీ మనుషులకుంటాయా ? మరేవిటో ఎప్పుడూ అమ్మ ఒక్క రెక్క మీద నడవాలి పనులన్నీ అంటుంది. ఇందూ, బుజ్జీ వరండాలో వాళ్ళ వాళ్ళ సంసారం బుట్టలు ముందెట్టుకుని గట్టిగట్టిగా అరుచుకుంటూ ఆడుకుంటున్నారు. ఇల్లు గల తాతగారు హాలు తెరుచుకుని వరండాలోకొచ్చి "ఏవే దెయ్యం! ఏవిటాగోల ? నోరు మూసుకుని ఆడుకోలేరూ ? బంగారం లాంటి కునుకు తేల్చేశారు వెధవ గోల చేసి" అని కేకలేశారు. ఇందూ వూరుకోవచ్చుగా. "తాతగారూ మా ఇళ్ళు దూరం దూరం. అరుచుకోపోతే మాటలెలా వినిపిస్తాయి" అని నాము సుద్ద పట్టుకొచ్చి వరండా మధ్యలో నిలువునా గీత గీసింది. "నలభై రూపాయలద్దె ఇస్తున్నాం. మా వాటాలో మా ఇష్టమొచ్చినట్లరచు కుంటాం. మీ వేపుకి వచ్చి అరిస్తే కేకలెయ్యండి" అని ఇంకా గట్టిగా అరవడం మొదలెట్టింది. దాంతో ఆయనికి ఇంకా కోపం వచ్చి "లేవనీ మీ అమ్మని, నీ పని చెప్తా!" అని ధడాలున తలుపేసుకుని లోపలికెళ్ళిపోయారు.

ఇంకనేననుకున్న పని అలాగేమిగిలిపోయింది కదా ! ప్రమోదక్కా పాపక్క వాళ్ళ ఇళ్ళకి వెళ్లి దేవుడ్ని చూసేశా. కుసుమా వాళ్ళు అన్నాలు తింటున్నారు. దణ్ణం పెట్టుకుని వచ్చేశా. మామీ వాళ్ళ తలుపేసి వుంది. తలుపు కొడదావనుకున్నా గానీ భయవేసింది. హాలు కిటికీలోంచి చూస్తే దేవుడు కనపడ్డాడు. ఇంక మళ్ళీ లోపలికెళ్ళడం ఎందుకులే అని కిటికీలోంచే దర్శనం చేసుకుని ఇంటికిపరిగెత్తికొచ్చేశా. నేనెంతో తొందరగా వచ్చాననుకున్నా గానీ అప్పటికి అమ్మ నిద్దర లేవనే లేచింది. "ఎక్కడూరేగొచ్చావే ఇంతసేపూ! ఎవరిళ్ళకీ మధ్యాహ్నాలు వెళ్ళకూడదని చెప్పానా ?"

'నేనెవరి నిద్దర్లూ చెడగొట్ట లేదులే అమ్మా ! ఇంకా కొందరయితే అన్నాలే తినలేదు. తొమ్మిది గణపతులని చూడ్డానికి ఒక్కసారి తిరగాలంటేనా కాళ్ళు నొప్పులెట్టవా ? అందుకని సగం మందిని ఇప్పుడు చూసొచ్చా, మిగతావి సాయంత్రం"

"గొప్ప పని చేశావు ! వూళ్ళో ఎవరికీ లేని నియమాలన్నీ నీకే. మహా భక్తురాలివి. ఏదో ఒంకెట్టుకోడం, వూరమ్మట తిరగడం, నోరెట్టుకు బతకవే వూరగంగానమ్మా అని కదిపితే సవాలక్ష కథలూ"

పోనీ అమ్మ తిట్లని తప్పించుకుందామని కాసేపు నాన్న పక్కన మంచం మీద పడుకుని నిద్రపోదామని ప్రయత్నంచేశా. ఉ, ఊ, నేను తెల్లారగట్ల లేస్తే కదా ఇప్పుడు నిద్దరొచ్చేందుకు! మళ్ళీ లేచి అటు ఇటు తిరగడంమొదలుపెట్టా. నా కష్టమానం ఆకలన్నావేస్తుంది. అది లేకపోతే

తోచక పోడమన్నా మొదలవుతుంది. అమ్మేమో గుమ్మం దగ్గిర కాళ్ళు జాపుకుని కూచుంది. ఆవిడ వళ్ళో చిన్నారి పడుకుని గారాలు పోతోంది. తీరుబడిగానే వుంది కదాని అమ్మా తోచట్లేదే అన్నాను.

''నీకు తోచకపోడంజబ్బు కొత్తగా వచ్చిందేవీ కాదుగా, ఎక్కడ చదువుకోమంటానో అని అన్ని పుస్తకాలూ పీటెక్కించేశావు వుండు నీ పని చెప్తా. నేనో మాట అంటా. అది తడబడకుండా తప్పుల్లేకుండా గబగబా పదిసార్లనాలి. ఇంకతోచకపోడంవుండదు. 'పాలింగ పట్టయ్య గారిపెద్దపాలికాపు కొత్తపాలికాపా ! పాతపాలికాపా ! ఇది ప్రాక్టీసు చేసుకో నా జోలికి రాకు'' అంది ఇదేదో బానేవుంది. రేపట్నించిస్కూల్లో కూడా బోలెడు కాలక్షేపం. నిజంగానే ప్రాక్టీసు మొదలుపెట్టాను.

ఈ లోపల చిన్నారి పెద్ద చదువుల సరస్వతి లాగా పెన్సిలు, పేపరు తీసుకుని రాసుకోడం మొదలు పెట్టింది. అదే పని చేసినా అమ్మకి మురిపెమే - ''మా చిన్నారి తల్లులు ఏం చదువు కుంటున్నారు ? ఇంత శ్రద్ధగా చదువుకుని పెద్ద వాళ్ళయి మంచి మంచి వుద్యోగాలు చేశారనుకో! అబ్బో ఫలానా వేంకటేశ్వరరావు గారమ్మాయిలు ఎంత బాగా చదువు కున్నారో అని అందరూ మెచ్చుకుంటారు చూశావా దాన్ని సుశీలా'' అంది.

''చదువుకోక ఏం చేస్తుందే పాపం. దానికో ఆటా రాదు పాటా రాదు. పోనీమంటే ఫ్రెండ్సన్నా లేరు'' అన్నా.

ఇంతలోకీ చిన్నారి తలెత్తి ''అమ్మా నేను ఫలానా నెహ్రూ గారమ్మాయిననిపించుకోవాల నుందే'' అంది.

''ఓసి నీనెహ్రూ పిచ్చి బంగారం కానూ. అలా అనిపించుకోవాలంటే చాలా కష్టపడాలి. సరేపెద్దయ్యాక మరి ఏం ఉద్యోగం చేస్తావురా ?'' అడిగింది అమ్మ.

''ఏమో! అది నాకు తెలియదు. ముందు చదువుకుంటా బాగా. కానీ నువ్వు మాత్రం ఈలోగా నాన్నతో పోట్లాడకుండా మంచి దానిలా వుంటూ బుద్ధిగా పెరిగి అప్పటికి ఫలానా చిన్నారీ వాళ్ళమ్మ వనిపించుకోవాలి.''

అమ్మ - దాని రెండు చేతులూ తన రెండు చేతుల్తో పట్టుకుని దీపావళి ఉప్పు పొట్లంలా గిరా గిరా తిప్పుతూ తిరుగుతూ ఒకటే నవ్వులు. 'నేనూ - నేనూ - ఫలానా చిన్నారీ వాళ్ళమ్మ నని పించుకోవాలా?'' అంటూ. అక్కడ నేననే దాన్నొకదాన్ని కూచుని వాళ్ళ వయ్యారాలు చూస్తున్నానని ధ్యాసుంటేగా. వాళ్ళ లోకవే వాళ్ళది. ఏమయినా మా అమ్మ నిజంగా చిన్నారీ వాళ్ళమ్మే.